క్లుప్తంగా

విజేతలకు బహుమతుల ప్రదానం



చిలకలపూడి(మచిలీపట్నం): జాతీయ బాలిక దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సేవ్ గర్ల్ చైల్డ్ అంశంపై నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీల విజేతలకు కలెక్టర్ పి. రంజిత్‌బాషా మంగళవారం బహుమతులు అందజేశారు. ఆయన చాంబర్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రతిభ చూపిన వివిధ పాఠశాలల బాలికలు, డీఎం హెచ్‌ఓ గీతాబాయి పాల్గొన్నారు.

బందరు డీఎస్పీ మాసూంబాషాకు ఏఎస్పీగా పదోన్నతి

కోనేరుసెంటర్: బందరు డీఎస్పీ షేక్ మాసూం బాషాకు అడిషనల్ ఎస్పీగా పదోన్నతి లభించింది. ఈ మేరకు ప్రభుత్వం తరఫున ప్రిన్సిపల్ సెక్రటరీ హరీష్‌కుమార్ గుప్తా ఉత్తర్వులు జారీ చేశారు. 2012 బ్యాచ్‌కు చెందిన మాసూంబాషా హైదరాబాద్ సిటీ పంజాగుట్టలో ట్రాఫిక్ డీఎస్పీగా పనిచేశారు. అనంతరం కడప, అమలాపురం, మార్కాపురంలలో విధులు నిర్వహించారు. అక్కడి నుంచి బదిలీపై బందరు సబ్-డివిజన్ డీఎస్పీగా వచ్చారు. మాసూంబాషా తొలుత ఉపాధ్యాయునిగా పనిచేశారు. పదోన్నతి పొందిన మాసూంబాషాను జిల్లా ఎస్పీ పి. జాషువా, అడిషనల్ ఎస్పీ ఎస్. వెంకట రామాంజనేయులు, ఇతర అధికారులు, సిబ్బంది అభినందించారు.

19న మండల పరిషత్ టీచర్స్ కో-ఆపరేటివ్ ఎన్నికలు

అవనిగడ్డ: అవనిగడ్డ మండల పరిషత్ టీచర్స్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఎన్నికలు ఫిబ్రవరి 19వ తేదీన జరుగుతాయని అసిస్టెంట్ రిజిస్ట్రార్ కె. లీల మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంఘ సభ్యులు ఎన్నికల్లో పాల్గొనాలన్నా, ఎన్నికల్లో పోటీ చేయాలన్నా డిఫాల్టర్లు తమ రుణాలను జరిమానాతో సహా చెల్లించాలని, లేకుంటే ఓటు అర్హత కోల్పోతారని చెప్పారు. ఓటర్ల జాబితాను ఈనెల 27వ తేదీన నోటీస్‌బోర్డులో ఉంచుతామన్నారు. ఈనెల 27 నుంచి ఫిబ్రవరి ఒకటవ తేదీ వరకు అభ్యంతరాలు స్వీకరిస్తామని చెప్పారు.

గ్రామ సచివాలయాల్లో ఆధార్ నమోదు

మెరకనపల్లి(మోపిదేవి): గ్రామ సచివాలయాల్లో ఆధార్ నమోదు కార్యక్రమం చురుగ్గా సాగుతోంది. మెరకనపల్లి గ్రామ సచివాలయంలో గ్రామస్తులతో పాటు విద్యార్థుల ఆధార్ నెంబర్ అప్‌డేట్ మంగళవారం చేయించుకున్నారు. మెరకనపల్లి, టేకుపల్లి గ్రామాల ఎంపీపీ పాఠశాల విద్యార్థులు బయోమెట్రిక్ అప్‌డేట్ చేయించుకున్నారు. సర్పంచ్ యర్రంశెట్టి ధన రాజ్యలక్ష్మి, ఒకటో వార్డు సభ్యుడు శోభిల రాఘవయ్య పర్యవేక్షించారు.

బందరు అసెంబ్లీ వైఎస్సార్ సీపీ కన్వీనర్లు వీరే

మచిలీపట్నం టౌన్: మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కన్వీనర్లను ఆ పార్టీ కృష్ణా జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) నియమించారు. నియోజకవర్గ కన్వీనర్లుగా మాజీ కౌన్సిలర్లు చిటికిన నాగేశ్వరరావు, శీలం బాబ్జీ, గూడవల్లి నాగరాజు, మాజీ సర్పంచులు వాలిశెట్టి రవిశంకర్, శొంఠి ఫరీద్ నియమితులయ్యారు. వీరిని పలువురు అభినందించారు.

29న మెగా వైద్య శిబిరం

చల్లపల్లి: లయన్స్ క్లబ్ ఆఫ్ వీఆర్‌కే నగర్ ఆధ్వర్యంలో ఈ నెల 29న స్థానిక విజయా హైస్కూల్‌లో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తామని క్లబ్ కార్యదర్శి నర్రా సాయిబాబు తెలిపారు. మంగళవారం స్థానిక లయన్స్‌క్లబ్ మాజీ అధ్యక్షులు ఎస్‌జీపీ బాషా కార్యాలయంలో ఆయన మాట్లాడారు. విజయవాడ పల్లెం పెద్దేశ్వరరావు హాస్పిటల్ వైద్యులచే ఉచితంగా గుండె, బీపీ, షుగర్, నేత్ర పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు, కళ్లజోళ్లు, కంటి ఆపరేషన్లు ఉచితంగా చేయిస్తామని తెలిపారు.

సత్తా చాటిన విద్యార్థులు

బంటుమిల్లి: రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్ రవాణా శాఖ ఈ నెల 18 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో స్థానిక కొమ్మారెడ్డి హైస్కూల్ విద్యార్థులు సత్తా చాటారని పాఠశాల డైరెక్టరు కె. కిషోర్ తెలిపారు. వెంట్రపాటి కీర్తన, పామర్తి నిత్యానంద లోకేష్ ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించారని చెప్పారు. విజేతలకు జిల్లా ఎస్పీ జాషువా బహుమతులు అందచేసి అభినందించారు. విద్యార్థులను డైరెక్టర్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

కొబ్బరి సాగుపై రైతులకు అవగాహన

కృత్తివెన్ను: రైతులు సరైన అవగాహనతో కొబ్బరి సాగు చేయాలని జిల్లా ఉద్యాన శాఖాధికారి జె. జ్యోతి అన్నారు. మంగళవారం చినగొల్లపాలెం దీవిలో కొబ్బరి రైతులకు సాగుపై అవగాహన సమావేశం నిర్వహించారు. సీనియర్ శాస్త్రవేత్త తిరుపతిరెడ్డి, జ్యోతి మాట్లాడుతూ సాగులో మెలకువలు, సాగు విధానం, తెగుళ్లు, సస్యరక్షణ చర్యలను రైతులకు వివరించారు. కొత్తగా సాగు చేయదలిచిన రైతులకు కోకోనట్ డెవలప్‌మెంట్ బోర్డు ద్వారా 50 శాతం రాయితీ ఇస్తారని చెప్పారు. కోకోనట్ డెవలప్‌మెంట్ బోర్డు నుంచి కిరణ్, ఉద్యానవన శాఖాధికారి చందు జోసెఫ్ సుందరం, సర్పంచ్ సునీల్, ఆర్‌బీకే చైర్మన్లు పాల్గొన్నారు.

నవరత్నాలతో పేదల ఇంట సంతోషాలు

- ఆరోగ్యశ్రీ పథకానికి పూర్వ వైభవం
- మంత్రి జోగి రమేష్
- ఐదుగుళ్లపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం

గూడూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నవరత్నాల సంక్షేమ పథకాలతో పేదల ఇంట సంతోషాలు వెల్లివిరుస్తున్నాయని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. గూడూరు మండలం ఐదుగుళ్లపల్లిలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరించి బ్రోచర్లను లబ్ధిదారులకు అందజేశారు. గ్రామానికి చెందిన వృద్ధుడు తాడంకి పాములు మాట్లాడుతూ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా కాలికి మూడు శస్త్ర చికిత్సలు చేయించుకున్నానని, ప్రభుత్వం తనపై ఎంతో దయతో వ్యవహరించిందని సంతోషం వ్యక్తం చేశాడు. దీనిపై స్పందించిన మంత్రి మాట్లాడుతూ ఆనాడు మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ పథకాన్ని గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్వీర్యం చేశారన్నారు. అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఆరోగ్య శ్రీ పథకానికి పూర్వ వైభవం తెచ్చే దిశగా చర్యలు చేపట్టారని తెలిపారు. పేద, మధ్య తరగతి ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా రూ.ఐదు లక్షల లోపు వార్షిక ఆదాయం ఉన్న కుటుంబాలను పథకం పరిధిలోకి తీసుకురావడమే కాకుండా చికిత్స అందించే ఆస్పత్రులను 1700కు పెంచారన్నారు. ప్రస్తుతం 2,446 వ్యాధులకు ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్సఅందిస్తుండగా మరో 700 రకాల వ్యాధులను దీని పరిధిలోకి తెచ్చేందుకు కసరత్తు చేస్తున్నామని వివరించారు.

పేదలందరికీ పక్కా ఇళ్లు..

అర్హులైన నిరుపేదలందరికీ పక్కా ఇళ్లు సమకూర్చే కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని మంత్రి జోగి రమేష్ తెలిపారు. ఇప్పటికే గ్రామంలో అర్హులైన వారందరికీ ఇళ్ల స్థలాలు, గృహ నిర్మాణ రుణాలు మంజూరు చేశామన్నారు. ఇంకా అర్హులైన వారెవరైనా ఉంటే వారికి కూడా ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన స్థలాలలో ఇళ్లు నిర్మించుకుని దశాబ్దాలుగా నివసిస్తున్న వారందరికీ సంపూర్ణ హక్కులు కల్పిస్తూ జగనన్న సంపూర్ణ హక్కు పత్రాలను అందించడం జరిగిందన్నారు. ఇవి జగనన్న మనకు ఇచ్చిన శాశ్వత ఆస్తులని, అవసరమైనప్పుడు వీటిని బ్యాంకులో తనఖాలు పెట్టి రుణాలు కూడా పొందవచ్చన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ముందు చూపుతో ప్రజలకు ఆదర్శవంతమైన పాలన అందిస్తున్న జగనన్నను ప్రజలు మనస్ఫూర్తిగా ఆశీర్వదించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ సంగా మధుసూదనరావు, జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పర్ణం పెదబాబు, ఏపీఎస్ఎఫ్‌సీ డైరెక్టర్ కారుమంచి కామేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకుడు గౌరిపర్తి రవికుమార్, మోటేపల్లి రత్నారావు, తలుపుల వెంకట కృష్ణారావు, లుక్కా ఏలేషు, మునిపల్లి బసవయ్య, మారుతి తదితరులు పాల్గొన్నారు. తొలుత గ్రామానికి వచ్చిన మంత్రి జోగి రమేష్‌కు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు.



గ్రామస్తుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న మంత్రి జోగి రమేష్;



ఎమ్మెల్యే సింహాద్రి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరుతున్న టీడీపీ నాయకులు

అర్హతే ప్రామాణికంగా పథకాలు: సింహాద్రి

నడకుదురు (చల్లపల్లి): కుల, మతాలకు, పార్టీలకు అతీతంగా, అర్హతే ప్రామాణికంగా ప్రతిఒక్కరికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు అన్నారు. మంగళవారం నడకుదురు సర్పంచ్ గౌరిపర్తి సురేష్‌బాబు ఆధ్వర్యంలో నడకుదురు, నాదెళ్లవారిపాలెం గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే రమేష్‌బాబు 261 ఇళ్లకు వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం వారికి అందించిన సంక్షేమ పథకాల ప్రయోజనాలు వివరించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. నడకుదురు శివారు రాముడుపాలెంలో ఇటీవల మృతిచెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు మాతంగి కృష్ణమోహన్ కుటుంబానికి వైఎస్సార్ బీమా పథకం ద్వారా రూ.10 వేలు తక్షణ ఆర్థిక సహాయాన్ని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు, సర్పంచ్ గౌరిపర్తి సురేష్‌బాబు అందజేశారు.

వైఎస్సార్ సీపీలో చేరికలు..

నడకుదురు శివారు నాదెళ్లవారిపాలెంలో తెలుగుదేశం పార్టీకి చెందిన ఇరవై కుటుంబాల వారు ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఎమ్మెల్యే రమేష్‌బాబు ఆహ్వానించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పక్షపాతానికి తావు లేకుండా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ఆకర్షితులమై వైఎస్సార్ సీపీలో చేరామని వారు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో మండల ఇన్‌చార్జి ఇంకొల్లు శేషగిరి, సర్పంచ్‌లు డొక్కు నాగేశ్వరరావు, వల్లూరు ఉమా, ఎంపీటీసీ డొక్కు దేవేంద్రరావు, మాజేరు పీఏసీఎస్ చైర్మన్ అరజా శివశంకర్, గ్రామ కన్వీనర్ జంపాన అంకమ్మ, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మాతా, శిశు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

గూడూరు: మాతా, శిశు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, దానికి అనుగుణంగా వైద్య, ఆరోగ్య సిబ్బంది పనిచేయాలని వైద్య, ఆరోగ్య శాఖ జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి శర్మిష్ఠ ఆదేశించారు. గూడూరు మండలం మల్లవోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శర్మిష్ఠ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఇచ్చే వ్యాక్సినేషన్‌పై సమీక్ష నిర్వహించారు. వ్యాక్సిన్లు నిలువ చేస్తున్న తీరును పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ప్రభుత్వ కార్యక్రమాలు సమర్థవంతంగా అమలు చేయాలని ఆమె ఆదేశించారు. వైద్యాధికారి టి.మాధురి పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకానికి వితరణ

పెడన: పట్టణంలోని బొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకుల ఆధ్వర్యంలో దాతల సాయంతో నిర్వహిస్తున్న 100 రోజుల మధ్యాహ్న భోజన పథకానికి పెడన కలంకారీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు మంగళవారం రూ.15 వేలను పథక నిర్వాహకులు, కళాశాల అధ్యాపకుడు పేరిశెట్టి నాగరవికి అందజేశారు. విజిటబుల్ హ్యాండ్ బ్లాక్ కలంకారీ ప్రింట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి సజ్జా నాగేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపాల్ సాల్మన్‌రాజు, కలంకారీ వెల్ఫేర్ సంఘ నాయకులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

పెడన: పట్టణానికి చెందిన సహాయ ఫౌండేషన్ సభ్యులు మంగళవారం 14వ వార్డుకు చెందిన మూడు నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరుకులు, 25 కిలోల బియ్యం, రూ.1,500, రూ.1000, రూ.500 చొప్పున నగదు అందజేశారు. ఫౌండేషన్ అధ్యక్షుడు ఉస్మాన్ బాషా మాట్లాడుతూ చిట్టిబొమ్మ సరస్వతి, మోచర్ల రామచంద్రరావు, రవి కుటుంబాలకు ఈ సాయం అందించామన్నారు. వెంద్రప్రగడ రామకృష్ణ, మామిడి ప్రసాద్‌లు సాయం అందించారని చెప్పారు.

సంక్షేమ పాలనను ప్రజలకు వివరించండి



మాట్లాడుతున్న కందుల రవీంద్రారెడ్డి చిత్రంలో ఎమ్మెల్యేలు వల్లభనేని వంశీ, సింహాద్రి, పేర్ని నాని, కైలే

కందుల రవీంద్రారెడ్డి, పేర్ని నాని

మచిలీపట్నంటౌన్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పాలనను ప్రజల్లోకి తీసుకు వెళ్లేందుకు వైఎస్సార్ సీపీకి చెందిన ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆ పార్టీ జోన్-3 కో-ఆర్డినేటర్ కందుల రవీంద్రారెడ్డి, కృష్ణాజిల్లా అధ్యక్షుడు పేర్ని నాని అన్నారు. నగరంలోని రైస్‌మిల్లర్స్ హాల్‌లో మంగళవారం బందరు పార్లమెంటరీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ మండల స్థాయి కన్వీనర్ల సమావేశం ఎమ్మెల్యే పేర్ని నాని అధ్యక్షతన నిర్వహించారు. రవీంద్రారెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నివర్గాలకు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. కరోనా కష్టకాలంలోనూ పథకాలు అమలు చేశారన్నారు. మీ పరిధిలోని గ్రామ, వార్డు కన్వీనర్లు, గృహ సారథులతో సమన్వయం చేసుకుంటూ ఆయా కుటుంబాలకు అందిన పథకాలను వివరించాలన్నారు. కన్వీనర్లు గృహ సారథులతో సమస్యలపై స్పందిస్తూ పరిష్కారానికి కృషి చేయాలని చెప్పారు. త్వరలో లబ్ధిదారులకు చేయూత చెక్కుల పంపిణీ కార్యక్రమం ఉంటుందని, ఈ చెక్కులను మండల, గ్రామ, వార్డు కన్వీనర్లు అందజేయాలన్నారు. సమావేశంలో మచిలీపట్నం, అవనిగడ్డ, పెడన, గుడివాడ, పామర్రు, పెనమలూరు, గన్నవరం నియోజకవర్గాలకు చెందిన మండల కన్వీనర్లు, ఆయా నియోజకవర్గాల ఇన్‌చార్జీలు బుర్రా జయరాజ్, పి. శ్రీలక్ష్మీ, తన్నీరు నాగేశ్వరరావు, ఎస్ఎంఆర్ పెదబాబు, ఎమ్మెల్యేలు కైలే అనిల్‌కుమార్, వల్లభనేని వంశీమోహన్, సింహాద్రి రమేష్‌బాబు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయండి

గూడూరు: సచివాలయాల కన్వీనర్లుగా నియమితులైన వారు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. పెడన పట్టణ, పెడన, గూడూరు, బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల సచివాలయాల కన్వీనర్లుగా నియమితులైన మతీన్‌ఖాన్, బెజవాడ నాగబాబు, కనపర్తి రాజు, కొప్పర్తి సుబ్బారావు, కొక్కిలిగడ్డ బాపూజీలు మంగళవారం గూడూరు మండలం ఐదుగుళ్లపల్లిలో మంత్రి జోగి రమేష్‌ను కలిసి తమ నియామకంపై కృతజ్ఞతలు తెలిపి సత్కరించారు.

జేజేఎం పనులకు భూమి పూజ

బంటుమిల్లి: పెందుర్రులో కేంద్ర ప్రభుత్వ నిధులతో జల జీవన్ మిషన్ (జేజేఎం) పథకంలో చేపట్టిన పనులకు మంగళవారం ఎంపీటీసీ మాదాసు శకుంతల భూమి పూజ చేశారు. రూ. 48 లక్షల నిధులతో సంపు, 3 కి. మీ పైపు లైను, పంపు హౌస్ నిర్మాణ పనులు చేపట్టనున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ ఫ్లెక్సీ బ్యానర్లు నిషేధం

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో ప్లాస్టిక్ ఫ్లెక్సీ బ్యానర్లను ఈ నెల 26వ తేదీ నుంచి పూర్తి స్థాయిలో నిషేధించామని ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ టి. ప్రసాదరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్లాస్టిక్ ఫ్లెక్సీలకు బదులుగా పర్యావరణ హితమైన పదార్థాలతో తయారుచేసిన గుడ్డ, ఫ్యాబ్రిక్ ఫ్లెక్సీలను మాత్రమే అనుమతిస్తామన్నారు. నిషేధాన్ని ఉల్లంఘిన వారికి అపరాధ రుసుం వసూలు చేస్తామని తెలిపారు.

బహిరంగ ప్రదేశాల్లో పొగాకు ఉత్పత్తుల వినియోగం వద్దు

మచిలీపట్నంటౌన్: బహిరంగ ప్రదేశాల్లో, విద్యా సంస్థల వద్ద, ప్రార్థనా మందిరాల ఆవరణలో ధూమపానం చేయటం, పొగాకు ఉత్పత్తులను అమ్మడం వంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ గీతాబాయి హెచ్చరించారు. జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పొగాకు, సంబంధిత ఉత్పత్తులను సేవించడం వల్ల కలిగే దుష్ప్రభావాలను వివరించారు. రాష్ట్ర పొగాకు నియంత్రణ విభాగం న్యాయ సలహాదారు పుట్టి శివశంకర్, సీఐ ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

30లోగా గృహ సారథుల నియామకం పూర్తిచేయాలి

మంత్రి జోగి రమేష్

గూడూరు: సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల నియామకం ఈనెల 30వ తేదీలోగా పూర్తి చేయాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ ఆదేశించారు. మంగళవారం గూడూరు మండలం ఐదుగుళ్లపల్లి గ్రామంలో గూడూరు, పెడన, బంటుమిల్లి, కృత్తివెన్ను, పెడన పట్టణ నాయకులతో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల నియామకంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. వైఎస్సార్ సీపీలో క్షేత్రస్థాయి కార్యకర్తలను స్థానిక నాయకులతో సమన్వయం చేయడానికి, అత్యంత ప్రభావవంతంగా సేవలు అందించడానికి సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో కూడిన జేసీఎస్ అనే వ్యవస్థీకృత వ్యవస్థ పనిచేస్తుందని మంత్రి తెలిపారు. అందుకు అనుగుణంగా వారి నియామకం పూర్తి చేయాలని సూచించారు. వచ్చే నెల ఒకటో తేదీన నియోజకవర్గ వ్యాప్తంగా 32,500 మంది పెన్షన్ లబ్ధిదారుల గృహాలకు వెళ్లి పెన్షన్లు అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తనతో సహా స్థానిక ప్రజాప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, పార్టీ శ్రేణులు భాగస్వామ్యం కావాలన్నారు. లబ్ధిదారుల ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన వివరిస్తూ పెన్షన్ అందించి ప్రభుత్వాన్ని ఆశీర్వదించమని కోరుతూ పండుగలా కార్యక్రమాన్ని నిర్వహించాలని చెప్పారు. కార్యక్రమంలో పెడన పట్టణంతో పాటు గూడూరు, పెడన, బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాలకు చెందిన పార్టీ కన్వీనర్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మార్కెట్ యార్డు చైర్మన్లు అనుబంధ విభాగాల అధ్యక్షులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించండి

కలెక్టర్ రంజిత్‌బాషా

చిలకలపూడి(మచిలీపట్నం): రసాయనిక ఎరువులు, పురుగుల మందులు లేని ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని కలెక్టర్ రంజిత్‌బాషా అధికారులకు సూచించారు. మంగళవారం ఆయన చాంబర్‌లో జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో పొలంబడి కార్యక్రమం ద్వారా ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఎలాంటి పురుగుమందులు వాడకుండా పూర్వీకులు పంటలు పండించారని దాని వల్ల ప్రకృతిని కాపాడటంతో పాటు ఆరోగ్యాన్ని కూడా పొందవచ్చునని వివరించారు. రబీ సీజన్‌కు సంబంధించి ఈ-క్రాప్‌ను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. వచ్చే ఖరీఫ్ సీజన్ నాటికి కాలువల మరమ్మతులు, పూడికతీత పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ అపరాజిత సింగ్, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ జన్ను రాఘవరావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి మనోహరరావు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని వాహన చోదలపై చర్యలు

పరిమితికి మించి ప్రయాణికులను తీసుకువెళ్లే వాహనాలపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి. రంజిత్‌బాషా సూచించారు. ఆయన చాంబర్‌లో మంగళవారం రహదారి భద్రతపై ఆర్టీసీ, ట్రాన్స్‌పోర్ట్, జాతీయ రహదారులు, పోలీస్ అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ చల్లపల్లిలోని కాసానగరం వద్ద తరచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, దీనిపై ఆయాశాఖల అధికారులు కారణాలను విశ్లేషించి నివేదికలు ఇవ్వాలన్నారు. ప్రధాన రహదారులపై పశువుల సంచారాన్ని నివారించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా రవాణాధికారి సీతాపతిరావు, మునిసిపల్ కమిషనర్ చంద్రయ్య, డీఎంహెచ్‌వో గీతాబాయి, ఆర్టీసీ డిపో మేనేజర్ పెద్దిరాజు పాల్గొన్నారు.

విద్యతో అసమానతల తొలగింపు

డీఆర్వో వెంకటేశ్వర్లు

మచిలీపట్నంటౌన్: సమాజం అసమానతలను విద్యార్థినులు చదువు ద్వారానే తొలగించుకోవచ్చునని డీఆర్వో ఎం. వెంకటేశ్వర్లు అన్నారు. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక నోబుల్ కళాశాలలో జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. డీఆర్వో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్య, వైద్యం, రక్షణ లక్ష్యంగా సమాజంలోని అసమానతలను రూపుమాపేందుకు చదువు ఎంతో దోహదపడుతుందన్నారు. బాలికలకు ప్రభుత్వం కల్పిస్తున్న రిజర్వేషన్లు సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం బాలికలకు ఎన్నో ప్రోత్సాహకాలను అందిస్తోందని వివరించారు. బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ సీహెచ్ లక్ష్మీదుర్గ, సాంఘిక సంక్షేమశాఖ డీడీ కె. సరస్వతి మాట్లాడుతూ బాలికల చదువుకు ప్రభుత్వం ఆర్థిక ప్రోత్సాహం అందిస్తోందన్నారు. ఐసీడీఎస్ పీడీ ఎస్. సువర్ణ, కళాశాల ప్రిన్సిపాల్ ఎర్నెస్ట్, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ఝాన్సీలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

అజ్మీర్ దర్గాకు చాదర్ సమర్పణ

మచిలీపట్నంటౌన్: అజ్మీర్‌లోని హజ్రత్ ఖాజా గరీబ్ నవాజ్ ఉరుసు మహోత్సవాలకు మచిలీపట్నం నుంచి సుమారు 250 మంది ముస్లింలు ప్రత్యేక రైలులో మంగళవారం తరలివెళ్లారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో చాదర్‌ను అజ్మీర్ వెళుతున్న వైఎస్సార్ సీపీ కార్యకర్త అబ్దుల్ ఖయ్యూంకు వైఎస్సార్ సీపీ నాయకుడు పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), నగర అధ్యక్షుడు షేక్ సలార్‌దాదా అందజేశారు. తొలుత నగరంలోని పలు దర్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఊరేగింపుగా స్టేషన్‌కు చేరుకుని అజ్మీర్‌కు వెళ్లే అబ్దుల్ ఖయ్యూంకు చాదర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా పేర్ని కిట్టు, సలార్‌దాదా మాట్లాడుతూ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని వీరంతా ప్రార్థనలు చేస్తారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మట్టి తోలకానికి అనుమతి ఇవ్వాలని వినతి

అవనిగడ్డ: దక్షిణ చిరువోలులంక పంచాయతీ పరిధిలో జగనన్న లేఅవుట్లు, రహదారులకు మెరక తోలేందుకు అనుమతి ఇవ్వాలని సర్పంచ్ సనకా సుబ్రహ్మణ్యం, పలువురు లబ్ధిదారులు, గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ రామకృష్ణను కలిసి వినతిపత్రం అందజేశారు. పలువురు లబ్ధిదారులు మాట్లాడుతూ వరద ముంపు గ్రామం కావడం, పల్లంగా ఉండటంతో మెరక తోలుకునేందుకు మట్టి అవసరమని చెప్పారు. ఇళ్లు, నివేశన స్థలాలకు మెరక పనుల కోసం సర్పంచ్ పొలం నుంచి ఉచితంగా మట్టి తీసుకెళుతుంటే కొంతమంది అక్రమ మైనింగ్ అంటూ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టడంతో పాటు, జనసేన నాయకులు అడ్డు పడుతున్నారని చెప్పారు. మట్టి తోలకానికి అనుమతులు ఇప్పించి జగనన్న కాలనీల్లో ఇళ్లు నిర్మించుకునేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు విన్నవించారు. సర్పంచ్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఏ ఆధారంలేని కొంతమంది వృద్ధులు, మహిళల ఇళ్ల నిర్మాణం, లేఅవుట్లకు తమ పొలం నుంచి ఉచితంగా మట్టి తోలుతుంటే అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్నారంటూ కొంతమంది సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడుతున్నారని చెప్పారు. పేదల ఇళ్లకు ఉచితంగా మెరక పనులు చేయిస్తుంటే జనసేన నాయకులుఅడ్డుపడటం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. అనంతరం సీఐ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. స్థానికులు మట్టా రవి, బచ్చు సత్యనారాయణ, మట్టా పవన్ రావు, మోపిదేవి నారాయణరావు, సనకా సుబ్రహ్మణ్యం, శ్రీరాములు, పాంద్రాక మాణిక్యాలరావు, సనకా గోపి, పీతా రామ్మోహనరావు పాల్గొన్నారు.

బంటుమిల్లి మండలంలో కేంద్ర బృందం పర్యటన

బంటుమిల్లి: మండలంలోని సాతులూరు, పి. రావిగుంట గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన పలు పనులను కేంద్ర అధికారుల బృందం పరిశీలించింది. మంగళవారం ఆయా శాఖల మండల స్థాయి అధికారులతో కలిసి 12 శాఖల ద్వారా కేంద్ర ప్రభుత్వ నిధులతో జరిగిన ఉపాధి హామీ పథకం, అంగన్‌వాడీ, శాశ్వత గృహ నిర్మాణం, తాగునీరు, పంచాయతీరాజ్ తదితర పనులను బృందం సభ్యులు పరిశీలించారు. పంచాయతీ కార్యాలయాల వద్ద ఏర్పాటు చేసిన గ్రామ సభల్లో లబ్ధిదారులతో మాట్లాడారు. గత ప్రభుత్వ కాలంలో నిర్మించిన గృహాలకు బిల్లులు రాలేదని లబ్ధిదారులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన అధికారులు ప్రతి విషయం కలెక్టరుకు నివేదిక ఇస్తామన్నారు. సాతులూరు అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులను పలు ప్రశ్నలు వేసి వారి ప్రతిభను పరిశీలించారు. గ్రామ సభల్లో సర్పంచ్‌లు గొల్ల బాలస్వామి, దూసనపూడి చినబాబు, అధికారులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీల్లో పెడన విద్యార్థుల ప్రతిభ

పెడన: జిల్లా స్థాయి వక్తృత్వ, వ్యాసరచన, క్విజ్ పోటీల్లో పెడన విశ్వభారతి హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపారని ఎంఈఓ మెటాల్దారాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓటరు దినోత్సవంపై ఈనెల 23న పెడన నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీల్లో, మంగళవారం మచిలీపట్నంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లోనూ సత్తా చాటారని చెప్పారు. వక్తృత్వ పోటీల్లో జూనియర్ విభాగంలో కె. శ్రీలక్ష్మీ సుమ ప్రథమ బహుమతిని, సీనియర్స్ విభాగంలో ఎం. ప్రేమలత ద్వితీయ బహుమతిని, వ్యాసరచన పోటీల్లో జూనియర్స్ విభాగంలో వి. నాగలలిత ద్వితీయ బహుమతిని గెలుచుకున్నారన్నారు. విద్యార్థులను స్కూల్ ప్రిన్సిపాల్ అభినందించారు.

వాహనాల తనిఖీ

కృత్తివెన్ను: సీతనపల్లి వద్ద జాతీయ రహదారిపై వాహనాలను కృత్తివెన్ను ఎస్ఐ గణేష్‌కుమార్ మంగళవారం తనిఖీ చేసి పత్రాలను పరిశీలించారు. వాహనదారులకు అవగాహన కల్పించారు. అతివేగం ప్రాణాంతకమని చెప్పారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, లైసెన్సు కలిగి ఉండాలని, వాహన పత్రాలు కలిగి ఉండాలన్నారు.

ఉపాధి పనులపై ప్రజా వేదిక

నాగాయలంక: మండలంలో ఉపాధి హామీ పనులపై మంగళవారం స్థానిక ఉపాధి హామీ కార్యాలయం ఆవరణలో ప్రజావేదిక సభ జరిగింది. కృష్ణా జిల్లా డ్వామా ఫైనాన్స్ మేనేజర్ వెంకటలక్ష్మి నేతృత్వంలో మండలంలో 2020-21, 2021-22 మార్చి వరకు జరిగిన ఉపాధి హామీ పనులపై ఆడిట్ నిమిత్తం బృందాలు పూర్తి చేసిన తనిఖీ నివేదికలపై సమీక్షించారు. ఈ కాలంలో రూ.16.47 కోట్లతో జరిగిన 2,487 పనులు, రూ.3.95 కోట్లతో జరిగిన పంచాయతీరాజ్ శాఖ పనులపై ఆడిట్ టీమ్‌లు గ్రామ సభల ద్వారా సామాజిక తనిఖీలు పూర్తిచేశారు. జెడ్పీటీసీ సభ్యుడు మోకా బుచ్చిబాబు, ఎంపీడీఓ వేమూరి శ్రీనివాసరావు, ఏపీఓ రవికుమార్, విజిలెన్స్ విభాగం నుంచి రాజశేఖర్, ఎస్ఆర్‌పీ చంద్రమోహన్, తనిఖీ బృందం సభ్యులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

కృత్తివెన్ను: అన్ని గ్రామాల్లో నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా ఉపాధి హామీ పనులు జరగాలని ఎంపీడీఓ పిచ్చిబాబు అన్నారు. మంగళవారం ఆయన యండపల్లి పంచాయతీలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు.

పీఎం ఈజీపీకి దరఖాస్తుల ఆహ్వానం

చిలకలపూడి(మచిలీపట్నం): ప్రధానమంత్రి ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ పథకం (పీఎంఈజీపీ) ద్వారా పరిశ్రమలు స్థాపించే ఔత్సాహికుల నుంచి వస్తువుల తయారీ పరిశ్రమలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా పరిశ్రమల అధికారి ఆర్. వెంకట్రావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణ, గ్రామీణ పరిధిలోని ప్రజలు వస్తువుల తయారీ పరిశ్రమలకు రూ. 50 లక్షల వరకు, సర్వీసింగ్ పరిశ్రమలకు రూ. 20 లక్షల వరకు బ్యాంకుల ద్వారా రుణం పొందేందుకు అవకాశం ఉందన్నారు. ఇందులో 15 నుంచి 30 శాతం వరకు సబ్సిడీ ఇస్తారన్నారు. విద్యార్హత, ఫొటో, ఆధార్, కుల ధ్రువీకరణ పత్రం, ప్రాజెక్టు రిపోర్టును దరఖాస్తులో పొందుపర్చాలనానరు. మరిన్ని వివరాలకు సెల్: 88850 94095 నెంబరును సంప్రదించాలన్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో వక్కలగడ్డ యువకుని ప్రతిభ

చల్లపల్లి: రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో మండల పరిధిలోని వక్కలగడ్డ గ్రామ యువకుడు మురాల రాజశేఖర మణికంఠ ప్రతిభ చూపాడు. ఈనెల 20, 21 తేదీల్లో శ్రీకాకుళంలో జరిగిన రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ అండర్ 17 బాలుర విభాగం 400 మీటర్ల పరుగులో రజత పతకం, 200 మీటర్ల పరుగులో కాంస్య పతకం సాధించాడు. ప్రతిభ చూపిన మణికంఠను వక్కలగడ్డ పీఏసీఎస్ అధ్యక్షుడు హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ, పాల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు మల్లుపెద్ది నాగభూషణం (బోసు) అభినందించారు.